మతోన్మాదంతో కార్మికుల మధ్య బిజెపి చిచ్చు

- దాన్ని తిప్పికొట్టేందుకు ఐక్యంగా ముందుకు సాగాలి
- ఏప్రిల్ 5న ఢిల్లీలో మహాప్రదర్శనకు కష్టజీవులు కదిలిరావాలి
- సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె హేమలత
- ఆర్థిక సంక్షోభం తీవ్రతరం
- సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్



మహాసభలో మాట్లాడుతున్న హేమలత


మహాసభలో మాట్లాడుతున్న తపన్‌సేన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులం, ప్రాంతం, మతోన్మాదం పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల మధ్య చిచ్చుపెట్టి కార్పొరేట్లకు అనుకూల నిర్ణయాలు చేసుకుంటూ పోతున్నదని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె హేమలత ఆందోళన వ్యక్తం చేశారు. దాన్ని తిప్పికొట్టేందుకు కార్మిక సంఘాలన్నీ మరింత ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. 2023, ఏప్రిల్ ఐదో తేదీన కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సిద్దిపేటలోని మల్లు స్వరాజ్యం నగర్‌లోని సున్నం రాజయ్య ప్రాంగణంలో సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభ బుధవారం ప్రారంభమయింది. ఈ సందర్భంగా ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. గత మూడేళ్ల కాలంలో ప్రపంచం ముందు కరోనా, ఆర్థిక సంక్షోభం రూపంలో పెద్ద సమస్యలు వచ్చిపడ్డాయన్నారు. కరోనాతో లక్షలాది మంది చనిపోయారని, కోట్లాది మంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయకపోవడం వల్లనే ప్రపంచంలోనూ, దేశంలోనూ ఈ పరిస్థితి నెలకొందని చెప్పారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొందరి చేతుల్లోనే బంధీ కావడం ఆందోళనకరమన్నారు. కరోనా, ఆర్థిక సంక్షోభంతో కోట్లాది మంది రోడ్డునపడ్డారన్నారు. వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో మన దేశంలో పేదలకు వైద్య సౌకర్యాలు, ఉపాధి కల్పించడం, ఆసరాగా నిలవడం వంటి అంశాలనుంచి మోడీ సర్కారు పక్కకు తప్పుకున్నదన్నారు. మేలు చేయకపోగా కార్మికులపైనా, కష్టజీవులపైనా భారాలు మోపుతూ కార్పొరేట్లకు నష్టాల పేరిట రాయితీలు కల్పిస్తూ పోతోందని విమర్శించారు. మిగతా దేశాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉత్పన్నం అయ్యాయన్నారు. ఓవైపు ప్రజలు కరోనాతో అల్లాడుతుంటే మోడీ సర్కారేమో లేబర్‌కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వేగతరం చేసిందన్నారు. ఫ్రంట్‌లైన్ వర్కర్లు అంటూ ఆశా, అంగన్‌వాడీ వర్కర్లతో కరోనా సమయంలో సేవలు చేయించుకున్నదనీ, వారికి ఇస్తామన్న గౌరవ వేతనాలను మాత్రం ఇవ్వలేదని విమర్శించారు. కార్మికుల వేతనాల కోత, బోనస్, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వంటి పరిణామాలు దేశంలో జరుగుతున్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా అఖిల భారత స్థాయిలో సార్వత్రిక సమ్మెలను అన్ని కార్మిక సంఘాలతో కలిసి విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగానూ ఇలాగే పోరాటాలు ఉధృతం అవుతున్నాయన్నారు. ఇంగ్లాండ్‌లో రైల్వే కార్మికులు వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలలో మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి వస్తున్నారని చెప్పారు. గ్రీస్, ఇటలీ, ఫ్రాన్స్, అమెరికాలో జరుగుతున్న కార్మిక, ప్రజా పోరాటాల గురించి వివరించారు. ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాడుతున్న వామపక్షాల బలం ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని తెలిపారు. చిలీలో రవాణా చార్జీల తగ్గింపు కోసం మొదలైన పోరాటం అక్కడ రాజ్యాంగాన్నే మార్చుకునే దాకా ఊపందుకుందని చెప్పారు. మన దేశంలోనూ కార్మిక పోరాటాలు పెరిగాయన్నారు. అయితే, మన దగ్గర కార్మికులు ఐక్యం కాకుండా మతం, కులం, ప్రాంతం పేరుతో చీల్చి ఉంచే కుట్రలకు మోడీ సర్కారు పూనుకుందని విమర్శించారు. తెలంగాణలోనూ కనీస వేతనాల జీవో కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో బిజెపి ఉందన్నారు. టిఆర్‌ఎస్ కంటే బిజెపి మరింత ప్రమాదకరమన్నారు. బిజెపికి అవకాశం ఇస్తే పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టు అవుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి, కార్మికుల్లోకి తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత సిఐటియుపై ఉందని నొక్కి చెప్పారు. కష్టజీవుల ఐక్యతను పెంచుకుంటూ కార్మిక సంఘాలు ఐక్యపోరాటాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్మిక ఐక్యత మీద జనవరి 30న ఢిల్లీలో కార్మిక సంఘాల ఐక్య సమావేశం జరుగబోతోందని చెప్పారు. రీచ్‌టూ అన్‌రీచ్ పేరుతో ప్రతి కార్మికుని దగ్గరకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు.

ఆర్థిక సంక్షోభం తీవ్రతరం : తపన్‌సేన్

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం తీవ్రమైందని, అమెరికా, యూరప్, తదితర దేశాల్లో కార్మిక, ప్రజా ఉద్యమాలు ఊపందుకున్నాయని సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. ఈ సమయంలో కార్పొరేట్లు తమ లాభాలను ఏమాత్రం తగ్గించుకోకుండా మరింత పెంచుకోవడంలో భాగంగా కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు చుక్కరాములు అధ్యక్షతన తపన్‌సేన్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి తగ్గిందని, మరోవైపు నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. లాభాల అన్వేషణలో అందివచ్చిన ప్రతి అంశాన్నీ వినియోగించుకుంటున్నాయని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పనిపద్ధతుల్లోనూ మార్పులు తీసుకొచ్చి కార్మికుల పొట్టగొడుతున్నాయన్నారు. పనిగంటలు పెంచి పనిచేయించుకుంటున్న తీరుని, ఊబర్, ఓలా, స్విగ్గీ, తదితర సంస్థలు గిగ్ కార్మికులను శ్రమదోపిడీ చేస్తున్న తీరును వివరించారు. దేశంలో కొత్తగా రెండు కోట్ల మంది గిగ్‌కార్మికులు తయారు కాబోతున్నారని చెప్పారు. ఓవైపు ఉన్నవారు ఉపాధి కోల్పోయి.. మరోవైపు అవకాశాలు లేక కొత్తతరం వాళ్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అదే సమయయంలో నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా ద్రవ్యోల్బణం పెరిగిందని, నిత్యావసరాల ధరలు భగ్గుమంటుండటంతో సామాన్యులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని వివరించారు. వారు పోరాటాల్లోకి రాకుండా, ప్రభుత్వంమీద అసంతృప్తి పెంచుకోకుండా, ప్రజల మధ్య ఐక్యత రాకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన రాజకీయాలకు పూనుకుందని విమర్శించారు.

పథకాల లక్ష్యాన్ని చేరుకోవాలి..

ప్రజాశక్తి-హైదరాబాద్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్‌లోని లోకల్ హెడ్ ఆఫీస్‌ను జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాహెజాది బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా 2022-23నకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాల లక్ష్యాలను చేరుకోవాలని ఆమె బ్యాంక్ అధికారులకు సూచించారు. ఈ మీటింగ్‌కు ఎస్‌బిఐ అధికారులు దేబాషిస్ మిశ్రా, పికె మోహన్‌దాస్ హాజరయ్యారు.

మద్యం మత్తులో కారు డ్రైవర్..

పారిశుధ్య కార్మికురాలికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్.. పారిశుధ్య కార్మికురాలిని ఢీకొట్టాడు. దాంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డకు చెందిన అనసూయ జూబ్లీహిల్స్ డివిజన్ ఇంద్రానగర్‌లో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తోంది. బుధవారం ఉదయం రహదారులను శుభ్రం చేస్తున్న ఆమెను కారు ఢీకొట్టింది. ఆమె కాలికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సింగరేణీయుల సంక్షేమానికి సర్కారు ప్రాధాన్యం

- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిత్యం బొగ్గుగనుల్లో పనిచేస్తూ, సంపద సృష్టిస్తున్న సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు స్వయంగా వారికి అవసరమైన సంక్షేమ చర్యలను సమీక్షించి, కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దానిలో ప్రభుత్వం కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించింది. సింగరేణి ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును ప్రభుత్వం 61 ఏళ్లకు పెంచిందని, ప్రమాదవశాత్తూ మరణిస్తే, కంపెనీ ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్‌ను పది రెట్లు పెంచి ఇస్తుందని తెలిపింది. గతంలో మ్యాచింగ్ గ్రాంట్ రూ.లక్ష ఉండగా, ఇప్పుడు దాన్ని రూ.పది లక్షలకు పెంచినట్టు వివరించింది. డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్, ఎంఎంసికి బదులు గతంలో రూ.ఐదు లక్షలు చెల్లిస్తుండగా, ఇప్పుడు రూ.25 లక్షలకు పెంచినట్టు తెలిపింది. కార్మికుల సొంతింటి నిర్మాణానికి రూ.పది లక్షల రుణం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్మికులతో పాటు వారి తల్లిదండ్రులకూ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, కాలనీల్లోని క్వార్టర్స్‌లో ఏసీ సౌకర్యం, ఐఐటి, ఐఐఎం చదివే కార్మికుల పిల్లల ఫీజులను కూడా కంపెనీనే చెల్లిస్తోందని వివరించారు. మెడికల్ అన్‌ఫిట్ ద్వారా ఉద్యోగం వద్దనుకునే వారికి ఏకమొత్తంగా రూ.25 లక్షలు, లేదా నెలకు రూ.26,293 చెల్లించే పథకాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపింది. మహిళా ఉద్యోగులకు 12 వారాల ప్రసూతి సెలవులను 26 వారాలకు పెంచి, చైల్డ్ కేర్ లీవులు ఇస్తున్నామని చెప్పింది. కరెంటు బిల్లుల్ని రద్దు చేస్తూ, రిటైర్డ్ ఉద్యోగులకూ వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్టు పేర్కొంది. 9,444 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ చేశామని తెలిపింది. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని సెలవు దినంగా ప్రకటించామనీ, రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యోగులందరికీ తెలంగాణ ఇంక్రిమెంట్ మంజూరు చేశామని వెల్లడించింది. సింగరేణి లాభాల్లో కార్మికుల వాటాను బోనస్ రూపంలో ఏటా పెంచి ఇస్తున్నామని తెలిపింది. వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తోందని, భవిష్యత్‌లో మరిన్ని అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టే ఆలోచనలూ చేస్తున్నామని వివరించింది.

వ్యాక్సిన్ తీసుకున్నా... జాగ్రత్తలు పాటించాల్సిందే


- డాక్టర్ రాజీవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎర్రగడ్డ ఛాతి వైద్యశాల కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రాజీవ్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం తీసుకున్న వ్యాక్సిన్ ఇప్పటి వరకున్న వేరియంట్లపై చూపించినంతగా, కొత్త వేరియంట్లపై ప్రభావం చూపించలేవని స్పష్టం చేశారు. అందువల్ల ముందు జాగ్రత్తగా మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, అవసరమైతే తప్ప రద్దీ ప్రదేశాలకు వెళ్లకుండా ఉండటం తదితర కరోనాకు సంబంధించిన జాగ్రత్తలను కొనసాగించాలని తెలిపారు.

మార్క్సిజానికి దగ్గరవుతున్న కార్మికవర్గం

- దానిపై అధ్యయనం పెరిగింది...
- 'రాజకీయ అర్థశాస్త్రం' పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకం ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్క్సిజానికి కార్మిక వర్గం దగ్గరయ్యే పరిస్థితులు పెరుగుతున్నాయని సుందరయ్య విజ్ఞానకేంద్రం మాజీ కార్యదర్శి సి సాంబిరెడ్డి అన్నారు. గడచిన 30 ఏళ్ల కాలంలో మార్క్సిస్ట్ సాహిత్యం అధ్యయనం చేసేవారి సంఖ్య పెరిగిందనీ చెప్పారు. నవశకం ప్రచురణలు ఆధ్వర్యంలో బుధవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్‌హాల్‌లో 'రాజకీయ అర్థశాస్త్రం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానానికి పుట్టినిల్లు బ్రిటన్ ఇప్పుడు ఆర్థిక సంక్షోభంతో విలవిల్లాడుతున్నదనీ, లాటిన్ అమెరికాలో అభివృద్ధి నిరోధక శక్తుల్ని ఓడించి, అభ్యుదయవాదులు విజయం సాధించారనీ ఉదహరించారు. భారతదేశంలోనూ ప్రధాని నరేంద్రమోడీ సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రైతు ఉద్యమం తిప్పికొట్టిందని చెప్పారు. మార్క్సిస్ట్ సాహిత్యం జనంలోకి మరింత విస్తృతంగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అర్థశాస్త్రాలు అనేకం ఉన్నాయనీ, అదనపు విలువ, రేటును లెక్కగట్టే సైద్ధాంతిక విధాన పద్ధతిపై ప్రజలకు అర్థమయ్యేలా విశ్లేషణ జరగాలని అభిలషించారు. రాజకీయ అర్థశాస్త్రంపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు 90 పేజీల్లో సరళంగా రాసారనీ, కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ దీనిపై పుస్తకాలు రాసారని తెలిపారు. ఎమ్మెస్ శంకరరావు (నవశకం ప్రచురణలు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ 'రాజకీయ అర్థశాస్త్రం' పుస్తక అనువాదం చాలా సరళమైన భాషలో ఉందన్నారు. చారిత్రక భౌతికవాదం అర్థంకాకుండా ఏదీ అర్థం కాదని చెప్పారు. రాజకీయ అర్థశాస్త్రాన్ని ప్రముఖ రచయిత్రి రంగనాయకమ్మ అనువదించారనీ, మరింత సులభంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వీడియోలూ చేశారని వివరించారు. ఈ పుస్తకంపై కూడా ఆ తరహా వీడియోలు చేస్తే, జనంలోకి మరింత వేగంగా వెళ్లే అవకాశాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. వీక్షణం సంపాదకవర్గ సభ్యులు బిఎస్ రాజు మాట్లాడుతూ మార్క్సిస్ట్ అవగాహన లేకుంటే ఏదీ అర్థంకాదని అన్నారు. ఎక్కడో చిన్న మార్పు వస్తే, దాన్నే సోషలిజం అని భావిస్తే ప్రమాదమని హెచ్చరించారు. యువతరం ఇలాంటి పుస్తకాలు అనువాదం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ మార్క్సిస్ట్ అర్థశాస్త్రాన్ని సమాజానికి అన్వయించడంలో వైఫల్యం కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తుల మధ్య దగ్గరి సంబంధాలు ఉండాలని చెప్పారు. విప్లవం లేకుండా వ్యవస్థల్ని మార్చలేమని స్పష్టం చేశారు. వై కిరణ్‌చంద్ర మాట్లాడుతూ అమెరికాలో ఉత్పత్తి శక్తుల పెట్టుబడి క్రమేణా తగ్గుతూ వస్తోందని చెప్పారు. ప్రస్తుత యువతరం యాంటీ ఫాసిస్ట్ పుస్తకాలను విరివిగా చదువుతున్నదని తెలిపారు. ప్రపంచ చారిత్రక నేపథ్య ఘటనలు పుస్తక రూపంలో రావాలని కోరారు. పుస్తక అనువాదకులు తోలేటి జగన్మోహనరావు పుస్తక పరిచయం చేశారు.



నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

ప్రభుత్వాస్పత్రికి తాళం వేసి నిరసన

- అందుబాటులోలేని పుల్కల్ పిహెచ్‌సి వైద్య సిబ్బంది
- ప్రమాదంలో గాయపడిన చిన్నారికి వైద్యం అందించని ప్రభుత్వ వైద్యులు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన పుల్కల్ గ్రామంలోని ఓ కుటుంబం ఆటోలో సింగూరు గ్రామానికి వెళ్తుండగా.. ఆ కుటుంబానికి చెందిన మౌనిత(4) మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు ఆ బాలికను పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో ఏ ఒక్క వైద్యుడూ అందుబాటులో లేకపోవడంతో బాలిక కుటుంబీకులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆస్పత్రికి తాళం వేసి రెండు గంటలపాటు బైటాయించారు. ఈ విషయాన్ని సంగారెడ్డి డిఎంఅండ్‌హెచ్ఒ, జిల్లా కలెక్టర్, జెడ్‌పి చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌లకు ఫోన్‌లో వివరించారు. ఈ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించినా ఏ మాత్రం ఫలితం లేకుండా పోతోందని వాపోయారు. వైద్యులు స్పందించకపోవడంతో చేసేదేమీ లేక బాలికను సంగారెడ్డిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఈ ఆస్పత్రినిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సాహితీ దిగ్గజం చావా శివకోటి ఆకస్మిక మరణం

- తెలంగాణ సాహితి, సాహితీ స్రవంతి సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఖమ్మం జిల్లా సాహితీ దిగ్గజం, ప్రసిద్ధ తెలుగు కథా నవలా రచయిత చావా శివకోటి(82) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. తన రచనలతో సాహిత్య రంగానికి విశేష సేవలందించారనీ, ఆయన ఆకస్మిక మృతితో సాహిత్యలోకం గొప్పసాహితీవేత్తను కోల్పోయిందని తెలంగాణ సాహితి, సాహితీ స్రవంతి పేర్కొన్నాయి. ప్రజాసమస్యలపై ఆయన అనేక రచనలు చేశారని గుర్తు చేశాయి. దాశరథి రంగాచార్య సమకాలికుడిగా తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న వివక్షను శివకోటి తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటారని పేర్కొన్నాయి. ఈమేరకు బుధవారం తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల్లభాపురం జనార్ధన, కె ఆనందాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, కె సత్యరంజన్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 'తెలంగాణ ఉద్యమాలు, గ్రామాల స్వరూపాల గురించి రచించారు. సాహిత్యంపై ఉన్న అభిరుచితో కథలు, కవితలు, కవితా సంపుటిలు, నవలలు రాసిన ఆయన 'అసురగణం'నవలతో తెలుగు సాహిత్యంలో సంచలనాన్ని సృష్టించింది. ఆయన 27 నవలలు రాయగా, ఆనాటి ప్రముఖ వార, మాస పత్రికలలో యువతను విపరీతంగా ఆకర్షించి ప్రజాదారణ పొందాయి. చావా శివకోటి గారు అనేక కథలూ రచించారు. 82 ఏళ్ల వయసులోనూ 'అనుబంధ బంధాలు', 'గతించిన గతం' నవలలను విడుదల చేశారు. సంచిక అనే పత్రికలో నేటికీ ఆయన నవల సీరియల్‌గా ప్రచురితమవుతోంది. 'సాహితీ-హారతి' పేరుతో మిత్రుడు డాక్టర్ హరీశ్ తో కలిసి సాంస్కృతిక వేదికను ఏర్పాటు చేసి ఎందరో సాహితీవేత్తలను సత్కరించారు. యువ రచయితలను ప్రోత్సహించారు' అని వారు ఈసందర్భంగా స్మరించుకున్నారు. శివకోటి మరణం పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

గొర్ల, మేకల పెంపకందారుల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయండి

కేంద్ర మంత్రికి రాష్ట్ర పశుసంవర్థక, వ్యవసాయ పరిశోధన సంస్థ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ గొర్ల, మేకల పెంపకందార్ల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర పశుసంవర్థక, వ్యవసాయ పరిశోధన సంస్థ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర పశుసంవర్థక, మత్స్య, డైయిరీ శాఖ మంత్రి పురుషోత్తం రూపాలకు ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ అధ్యరంలోని బృందం వినతిపత్రం సమర్పించింది. రాష్ట్ర పశుసంవర్థక, వ్యవసాయ పరిశోధన సంస్థ నేషనల్ కన్వీనర్ బి రామచంద్రుడు, నేషనల్ కో కన్వీనర్ గోసుల శ్రీనివాస్ యాదవ్, జాతీయ సమన్వయకర్తలు లొడంగి గోవర్ధన్ తదితరులు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు. గొర్ల మేకల రైతుల సమస్యలు, నేషనల్ బోర్డు ఏర్పాటు ఆవశ్యకతతోపాటు వివిధ అంశాలపై మంత్రితో విస్తృతంగా చర్చించారు.

కరెంటు చార్జీలపై ఫిబ్రవరి 20 నుంచి బహిరంగ విచారణలు

- జనవరి 31లోపు అభ్యంతరాలు పంపాలి : టిఎస్ఇఆర్‌సి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) సమర్పించిన 2023-24 వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలు (ఎఆర్ఆర్), 2016-17 నుంచి 2022-23 వరకు ఇచ్చిన కరెంటు కొనుగోళ్ల ట్రూఅప్ చార్జీలపై 2023 ఫిబ్రవరి 20 నుంచి బహిరంగ విచారణలు చేపట్టనున్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే 2023 జనవరి 31వ తేదీలోపు సమర్పించాలని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టిఎస్ఇఆర్‌సి) పేర్కొంది. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)పై బహిరంగ విచారణ ఫిబ్రవరి 20వ తేదీ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుంది. ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎన్‌పిడిసిఎల్) ప్రతిపాదనలపై ఫిబ్రవరి 22వ తేదీ హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ విచారణ జరుగుతుంది. టిఎస్ఎస్‌పిడిసిఎల్ ప్రతిపాదనలపై ఎర్రగడ్డలోని టిఎస్‌జెన్‌కో ఆడిటోరియంలో జరుగుతుంది. పై బహిరంగ విచారణలు అన్నీ ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయని టిఎస్ఇఆర్‌సి తెలిపింది.

24 గంటల్లో నాలుగు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు

- నిమ్స్ వైద్యుల రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేవలం 24 గంటల్లోనే నాలుగు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు నిర్వహించి నిమ్స్ వైద్యులు రికార్డు సృష్టించారు. రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ఖర్చయ్యే ఈ శస్త్రచికిత్సను ఆరోగ్య శ్రీ పథకం కింద పేద రోగులకు ఉచితంగా నిర్వహించారు. గత నాలుగైదు సంవత్సరాల నుంచి డయాలసిస్ చికిత్స పొందుతున్న బాధితులకు బ్రెయిన్ డెడ్ అయిన ముగ్గురు రోగుల కిడ్నీలను మార్పిడి చేశారు. ఒకరేమో బతికుండగానే కిడ్నీని దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ నాలుగు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు కూడా విజయవంతం అయ్యాయని నిమ్స్ వైద్యులు ప్రకటించారు. శస్త్రచికిత్సలను చేసిన డాక్టర్లకు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అభినందనలు తెలిపారు.

కన్నోజు మనోహరాచారికి కెటిఆర్ అభినందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జలమండలిలో ఓఎస్‌డి పౌరసంబంధాల విభాగం అధికారిగా పనిచేస్తున్న కన్నోజు మనోహరాచారిని పురపాలక, పరిశ్రమల, ఐటీ శాఖల మంత్రి తారకరామారావు అభినందించారు. ఆయన రాసిన "తెలంగాణ అభ్యుదయం-దేశానికి మహోదయం" పుస్తకాన్ని బుధవారం ప్రగతి భవన్‌లో మంత్రి ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గడచిన ఎనిమిదేళ్లలో వ్యవసాయం, పశుపోషణ, సాగునీరు, విద్య, వైద్యం, పురపాలన, పోలీస్, ఐటీ, అటవీ రంగాల్లో సాధించిన అభివృద్ధిని ఈ పుస్తకంలో వివరంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో ఒక వినూత్నమైన, అద్భుతమైన రాష్ట్రంగా తెలంగాణ బలపడుతున్నదనీ, దేశానికే రోల్ మాడల్‌గా తెలంగాణా ఐటీ సెక్టార్ ఉందని అన్నారు.కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మా రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీ శంకర్, దులం సత్యనారాయణ, శ్రీ హర్ష తదితరులు పాల్గొన్నారు.

బిఎంసిఇఎఫ్ సదస్సుకు ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్ ముక్తి మోర్చా వెనుకబడిన, మైనారిటీ వర్గాల ఉద్యోగుల ఫెడరేషన్ (బిఎంసిఇఎఫ్) 39వ జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిందిగా బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి విలాస్ ఖారత్ ఆహ్వానించారు. బుధవారం ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాదులో కవితను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు వామన్ మేశ్రమ్ నేతృత్వంలో ఈ జాతీయ సదస్సులు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అమె అంగీకరించారు.

మత సామరస్యానికి పుస్తక ప్రదర్శన

- నేటి నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్
- 300 పుస్తక దుకాణాలు, రెండున్నర లక్షల పుస్తకాలు
- జ్ఞానవంతులు కావాలంటే పుస్తకాలు చదవాలి
- బుక్‌ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ వెల్లడి


మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్

ప్రజాశక్తి - కల్చరల్

ఈ సారి హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఆధ్వర్యంలో నిర్వహించే పుస్తక ప్రదర్శన మత సామరస్యం నేపథ్యంలో ఉంటుందని, అందుకు తగినట్టు ప్రణాళికలు రూపొందించామని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ తెలిపారు. కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావుల ఐక్యత వర్ధిల్లాలి అంటే సమాజాన్ని నడిపించే రథ చక్రాలైన జ్ఞానవంతులు కావటానికి పుస్తకాలు చదవటం ముఖ్యమన్నారు. జాతీయ పుస్తక ప్రదర్శన గురువారంతో ప్రారంభమై జనవరి 1 వరకు కొనసాగుతోందన్నారు. నేటి నుంచి ఎన్‌టిఆర్ స్టేడియంలో (తెలంగాణ కళా భవన్)లో 35వ జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభం కానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన వివరాలను రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. పుస్తక ప్రదర్శనకు పది లక్షల మంది వీక్షకులు వస్తారని అంచనా వేశామని చెప్పారు. 300 పుస్తక దుకాణాల్లో రెండున్నర లక్షలకుపైగా పుస్తకాలు పలు సాహిత్యం, భిన్న భాషల్లో లభ్యమవుతాయని, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయుక్తంగా ఉండే పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రారంభ వేడుకలో మంత్రులు కెటిఆర్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొంటారన్నారు. ప్రజలు పుస్తకాలు చదవటం లేదన్నది వాస్తవం కాదని.. గత కాలం పుస్తక ప్రదర్శనశాలల్లో అమ్మకాలు చూస్తే ఈ విషయం తెలుస్తుందని అన్నారు. పుట్టినరోజు, వివాహం తదితర వేడుకల్లో నాయకులకు, మిత్రులకు, బంధువులకు పుస్తకం బహుమతిగా ఇచ్చే సంప్రదాయం రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో రీడింగ్ క్లబ్‌లు రావాలని ప్రచారం చేశామని తెలిపారు. అంబేద్కర్ స్టడీ సెంటర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ నిర్వహణలో, వివిధ రచయితల రచనలపై ముఖాముఖి కార్యక్రమం ఈసారి ప్రత్యేకత అని తెలిపారు. ఎనిమిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పుస్తక ప్రదర్శనకు అన్ని విధాల సహకారం అందిస్తోందని తెలిపారు. పుస్తక ప్రియుడైన ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినాన్ని పుస్తకప్రియులు పండుగగా జరుపుకోవాలని కోరారు. పుస్తక ప్రదర్శన అనేది లాభనష్టాలతో సంబంధం లేకుండా నిర్వహిస్తామన్నారు. ఆదాయ వ్యయాలపై ప్రజాశక్తి విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం దాటవేశారు.

అంబేద్కర్ స్టడీ సెంటర్ నిర్వాహకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. సామాజిక భావనలు ఉన్న గ్రంథాలపై రచయితలతో ముఖాముఖిని 23 నుంచి జనవరి 1 వరకు జరుపుతామని వివరించారు. సమావేశంలో సాహితీవేత్త కోట్ల వేంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

మావి న్యూట్రిషన్ పాలిటిక్స్..

- వారివి పార్టిషన్ పాలిటిక్స్
- ప్రజా కోణంలో ఆలోచించే పథకాలు
- న్యూట్రిషన్ కిట్‌ల పంపిణీ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు


గర్భిణీకి న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సంక్షేమం కోసం టిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుంటే.. కొందరు ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని ఆలోచిస్తున్నానని, తమవి న్యూట్రిషన్ పాలిటిక్స్ అయితే వారివి పార్టిషన్ పాలిటిక్స్ అని వైద్యా ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మాతా శిశు సంరక్షణకు పెద్ద పీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో విప్లవాత్మకమైన పథకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో "కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పంపిణీ" పథకాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఇక్కడి నుంచి వర్చువల్‌గా మిగతా 8 జిల్లాల్లో ప్రారంభించారు. అనంతరం గర్భిణీలకు కిట్స్ పంపిణీ చేశారు. ఇదే కార్యక్రమంలో ఆశాలకు చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. బిడ్డ కడుపులో పడ్డప్పుడు న్యూట్రిషన్ కిట్.. డెలివరీ అయిన తర్వాత కేసీఆర్ కిట్‌తో మాతా శిశు రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనతో పుట్టిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని ఈరోజు ప్రారంభించుకోవడం చారిత్రక ఘట్టమన్నారు. ఎనీమియా (రక్త హీనత) ప్రభావంతో ఉన్న గర్భిణీల సంఖ్య తొమ్మిది జిల్లాల్లో ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామని, ఇందులో ఆదిలాబాద్, భద్రాద్రి, భూపాలపల్లి, జోగులాంబ, కామారెడ్డి, కుమ్రంభీం, ములుగు, నాగర్ కర్నూల్, వికారాబాద్ ఉన్నట్టు తెలిపారు. దీని కోసం ప్రభుత్వం రూ. 50 కోట్లు ఖర్చు చేస్తున్నదని, ప్రోటీన్స్, మినరల్స్, విటమిన్స్, ఐరన్‌ను పోషకాహారం ద్వారా అందించి రక్త హీనత తగ్గించడం, హిమోగ్లోబిన్ శాతం పెంచడం న్యూట్రిషన్ కిట్ల లక్ష్యమని తెలిపారు. న్యూట్రిషన్ కిట్‌లో కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూర, ఐరన్ సిరప్ 3 బాటిల్స్, 500 గ్రాముల నెయ్యి, ఆల్‌బెండజోల్ టాబ్లెట్, కప్పు, ప్లాస్టిక్ బాస్కెట్ ఇవ్వనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజుల సురేందర్, ఉర్దూ అకాడమీ చైర్మెన్ ముజీబ్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు, కుటుంబ, సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల సమస్యలపై సమరశీల పోరాటాలు

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలో రూపకల్పన
- 29న భారీ బహిరంగ సభ... కేరళ సిఎం పినరయ్ విజయన్ రాక
- పోస్టర్ ఆవిష్కరణలో నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలకు శ్రీకారం చుట్టేందుకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్ధమవుతున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య చెప్పారు. ఈనెల 29,30,31 తేదీల్లో ఖమ్మంలో వ్యవసాయ కార్మిక సంఘం మూడో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహాసభల్లో కూలీల సమస్యలతోపాటు ఉపాధిహామీ చట్టం, పోడు, అసైన్డ్‌భూములు, సీలింగ్, దేవాదాయ భూములను పేదలకు పంపిణీ చేయాలనే డిమాండ్లపై చర్చించి కార్యచరణను రూపొందిస్తామని చెప్పారు. పేదలకు పంపించేందుకు పదిన్నర లక్షల ఎకరాల భూమి రాష్ట్రంలో ఉందని చెప్పారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 29న బహిరంగ సభకు కేరళ సీఎం పినరయ్ విజయ్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్‌తోపాటు సీనియర్ నాయకులు పాటూరి రామయ్య, సోమయ్య, రాష్ట్ర నాయకులు తదితరులు హాజరవుతారని తెలిపారు.

గుజరాత్ మోడల్ ఇదేనా?

కేంద్ర ప్రభుత్వం చెబుతున్న గుజరాత్ మోడల్‌లో రోజు కూలీకి రూ 216 ఇస్తున్నారని నాగయ్య విమర్శించారు. కేరళ రాష్ట్రంలో మాత్రం రూ 726 కూలీ చెల్లిస్తూ...దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేరళ ప్రభుత్వం కరోనా కాలంలో వలస కార్మికులకు వారికి కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసి ఆదుకున్నదని తెలిపారు. స్వరాష్ట్రానికి పోలేని పరిస్థితుల్లో తమ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడేందుకు అన్‌లిమిటెడ్ రిచార్జీ చేసిందని గుర్తు చేశారు. 16 రకాల నిత్యవసర సరుకులకు అతి తక్కువ ధరకు సరఫరా చేసిందని చెప్పారు.

ఆర్‌టిసి సేవలను మరిచిపోలేరు

- ఎమ్మెల్యే, టిఎస్ఆర్‌టిసి చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండి సజ్జనార్
- "తెలంగాణ ఆన్ ట్రాక్" పాట ఆవిష్కరణ


పాటను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి, ఎండి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసితో ప్రజలకు ఎంతో అనుబంధం ఉంటుందని, ఉన్నత స్థాయిలో ఉన్న వారూ ఆయా సందర్భాల్లో ఆర్‌టిసి సేవలను వినియోగించుకున్న రోజులను మరిచిపోలేరంటూ టిఎస్ఆర్‌టిసి చైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ అన్నారు. రవాణాకు ఆర్‌టిసి సేవలను వినియోగించుకోవాలని కోరారు. టిఎస్ఆర్‌టిసి బస్సు ప్రాముఖ్యతను వివరిస్తూ వైట్ థాట్స్ రూపకల్పనలో ప్రముఖ గాయకులు రామ్ మిరియాల ఆలపించిన "తెలంగాణ ఆన్ ట్రాక్" పాటను వారు బుధవారం హైదరాబాద్ ఎంజిబిఎస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి చైర్మెన్ మాట్లాడుతూ.. ప్రయాణీకులకు భద్రత విషయంలో ఎలా అయితే భరోసా ఇస్తున్నామో.. అలాగే ఉద్యోగుల సంక్షేమానికీ తగిన ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. త్వరలో కొత్తగా 300 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని, ఈ వారాంతంలో 50 కొత్త బస్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. స్లీపర్ కోచ్ ఎసీ బస్సులూ అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఆర్‌టిసి ఎండి మాట్లాడుతూ.. ఉన్నత స్థాయిలో ఉన్న వారూ ఎప్పుడో ఒకప్పుడు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించిన సందర్భాలు అనేకం అన్నారు. ప్రయివేటు వాహనాల వినియోగం పెరిగినా చాలా మంది ప్రజా రవాణా వ్యవస్థను ఆదరిస్తున్నారని తెలిపారు. బస్సు ప్రయాణ అనుభూతి వేరుగా ఉంటుందని, అందుకే టిఎస్ఆర్‌టిసిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ పాటను తీసుకొచ్చామని చెప్పారు. ప్రముఖ గాయకులు రామ్ మిరియాల మాట్లాడుతూ.. ఆర్‌టిసి సేవలను పాట రూపంలో చెప్పడం చాలా ఆనందంగా ఉందని, ప్రజలందరితో ఆర్‌టిసికి ఉన్న అనుబంధమే ఈ పాట అన్నారు. ఎంతో కాలంగా ఆర్‌టిసి బస్సు సేవలను వినియోగించుకుంటున్న ఉత్తమ ప్రయాణీకులను ఈ సందర్భంగా శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. వెంకట్ రామిరెడ్డి, సాయి కుమార్, ఎ.రాంబాబు, వేణుగోపాల్, జహన్ బేగం, దండ భాని, మంగిలాల్, సుజాత, సాజీదా బేగం, ఆశన్న గౌడ్, గౌసుద్దీన్ సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పురుషోత్తం నాయక్, యాదగిరి, మునిశేఖర్, సిటిఎం (ఎంఅండ్‌సి) విజయ కుమార్, సిటిఎం ప్రసాద్, రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీధర్, వైట్ థాట్స్ ప్రతినిధులు రాజు, ప్రదీప్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్ జ్యువెలర్స్‌లో ఆఫర్లు

ప్రజాశక్తి-హైదరాబాద్

కళ్యాణ్ జ్యువెలర్స్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన నూతన షోరూను బుధవారం నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఈ పూర్తి సరికొత్త షో రూమ్ అత్యంత విలాసవంతమైన, పునరుద్ధరించబడిన షాపింగ్ అనుభవాలను వైవిధ్యమైన, ట్రెండీ ఆభరణాల డిజైన్‌లను ప్రదర్శించడం ద్వారా అందిస్తుందని పేర్కొంది. ఈ పునరావిష్కరించిన షోరూమ్ వినియోగదారుల విస్తృతశ్రేణి ఆభరణాల అవసరాలను తీర్చుతుందని కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ పేర్కొన్నారు. వినియోగదారులను ఆకర్షించడానికి ఉత్సాహబరితమైన ఆఫర్లను అందిస్తున్నామన్నారు.

సుందరం ఫైనాన్స్‌తో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ జట్టు

హైదరాబాద్ : ఆర్థిక సేవల కంపెనీలలో ఒక్కటైన సుందరం ఫైనాన్స్ లిమిటెడ్, ఆరోగ్య బీమా సంస్థల్లో ఒక్కటైన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు పరస్పరం కార్పోరేట్ ఏజెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో సుందరం ఫైనాన్స్ ఎండి రాజీవ్ లోచన్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండి అనూజ్ గులాటీ పాల్గొన్నారు. ఈ భాగస్వామ్యంతో సుందరం ఫైనాన్స్ ఇప్పుడు కేర్ హెల్త్ యొక్క స్పెషలైజ్డ్, వినూత్నమైన శ్రేణీ ఆరోగ్య భీమా పరిష్కారాలను తమ లాయల్, వృద్ధి చెందుతున్న వినియోగదారులకు అందించనుందని ఆ సంస్థ తెలిపింది.

ఐక్య ఉద్యమాలకు సిద్ధమవుదాం

- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల కార్మికవర్గంతో పాటు ప్రజలకు సమస్యలు పెరిగాయని, పాలకుల తీరును ఎండగడుతూ ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర మహాసభలో ఈ మేరకు 'ఐక్య ఉద్యమాలకు సిద్ధం కండి' అంటూ తీర్మానాన్ని ఆయన ప్రవేశపెట్టారు. కార్మికులపై పనిభారం బాగా పెరిగిందని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టం ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా ఫ్లోర్‌లెవల్ కనీస వేతనంగా రూ.4,678 నిర్ణయించడాన్ని బట్టే మోడీ ప్రభుత్వం కార్మికులపై కక్షపూరిత వ్యవహరిస్తున్నదనేది అర్థం అవుతున్నదన్నారు. దీన్ని సాకుగా చూపెట్టి యాజమాన్యాలు కార్మికుల వేతనాల్లో కోతపెడుతున్నాయని, కేంద్రం చెప్పేదానికంటే తాము ఎక్కువ ఇస్తున్నామని చెబుతున్నాయని చెప్పారు. బిజెపి వచ్చాక ప్రజల మధ్య మత ఘర్షణలు సృష్టించి చీల్చే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఇది కార్మిక వర్గ ఐక్యతను కూడా దెబ్బతీస్తున్నదన్నారు. ఈ సవాల్‌ను ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలన్నీ కలిసికట్టుగా ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. ఈ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ పెట్టాలి..ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కేటాయించాలి
తీర్మానాన్ని ప్రవేశపెట్టిన రాగుల రమేశ్

రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కోరారు. స్టీల్ ఫ్యాక్టరీ విషయంలో చొరవ తీసుకోవాల్సిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యతిరేకంగా మాట్లాడటం తగదన్నారు. దీన్ని బట్టే రాష్ట్రం పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏంటో అర్థం అవుతున్నదన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. అట్లాగే గిరిజన యూనివర్సీటీ ఏర్పాటు హామీని కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిఐటియు పోరాటం చేస్తుందని స్పష్టంచేశారు. ఈ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీను టెక్నాలజీ ఎండి చిల్కా కావ్యశ్రీ

వ్యాపార రంగంలో మహిళలు రాణించాలి : అథవాలే

- శ్రీను టెక్నాలజీ కంపెనీకి ఫాస్టెస్ట్ గ్రోవింగ్ ఇండియన్ కంపెనీ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యాపార, వాణిజ్య రంగాల్లో మహిళలు మరింత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా న్యూఢిల్లీలో ఇంటర్ నేషనల్ అచీవర్స్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కంపెనీలకు అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన శ్రీను టెక్నాలజీ కంపెనీకి ఫాస్టెస్ట్ గ్రోవింగ్ ఇండియన్ కంపెనీ ఎక్సలెన్స్ అవార్డ్ దక్కింది. కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే చేతుల మీదుగా శ్రీను టెక్నాలజీ ఎండి చిల్కా కావ్యశ్రీ ఈ అవార్డ్‌ను అందుకున్నారు. ఈ సదస్సులో కేంద్ర మాజీ మంత్రి కెజె ఆల్ఫాన్స్, సిక్కిం మాజీ గవర్నర్ బిసి సింగ్, మాజీఎంపి జె.కె.జెయిన్, సుప్రీం కోర్ట్ సీనియర్ న్యాయవాది డాక్టర్ జివి రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే మాట్లాడుతూ వ్యాపార రంగంలో యువ దళిత మహిళ రాణిచండం పట్ల చిల్కా కావ్యశ్రీను అభినంధించారు. భవిష్యత్‌లో మరింత ఎదగాలని ఆకాక్షించారు. అనంతరం చిల్కా కావ్యశ్రీ మాట్లాడుతూ నేటి ఆధునీక ప్రపంచంలో డిజిటల్ మార్కెటింగ్ అత్యంత ముఖ్యమైన భూమికను పోషిస్తుందన్నారు. తక్కువ కాలంలోనే తమ శ్రీను టెక్నాలజీ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు.

ఆ విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అనుమతివ్వాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ పేరుతో అనుబంధ గుర్తింపు రాని కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అనుమతివ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో ఉన్న 465 ప్రయివేటు జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు ప్రస్తుత విద్యాసంవత్సరంలో గుర్తింపు ఇవ్వలేదని తెలిపారు. ఈ కళాశాలల్లో చదువుతున్న 80 వేల మంది విద్యార్థులు పరీక్ష ఫీజులు కట్టలేదని పేర్కొన్నారు. ఆలస్య రుసుం రూ.వెయ్యితో ఈనెల 22 వరకు, రూ.ఐదు వేలతో 28వ తేదీ వరకు ఫీజు కట్టేందుకు అవకాశముందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ కళాశాలలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో తనిఖీలు చేసి నిబంధనల ప్రకారం నడిచే కళాశాలలకు అనుమతులివ్వాలని సూచించారు. కానీ ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం వహించి పరీక్షలు దగ్గరకు వస్తున్న సమయంలో ఫీజులు కట్టించుకోకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని విమర్శించారు. 80 వేల మంది విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టాయిలెట్లను వెంటనే నిర్మించాలి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు సరిపడా టాయిలెట్లను వెంటనే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో 400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని బుధవారం మరో ప్రకటనలో తెలిపారు.

జిహెచ్‌ఎంసిలోకి కంటోన్మెంట్..!

- నేడో, రేపో రక్షణ మంత్రిత్వ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్‌ఎంసిలో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు రక్షణ శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఆమోదం తెలిపినట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సంసిద్ధతను తెలియజేస్తూ రక్షణ మంత్రిత్వ శాఖకు లేఖ రాయాల్సిందిగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉన్నతాధికారులకు చీఫ్ సెక్రటరీ సూచించారు. దాంతో మున్సిపల్ శాఖ అధికారులు లేఖను సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. దాంతో కంటోన్మెంట్ సివిలియన్ ప్రాంతాలు జిహెచ్‌ఎంసిలో కలిపే ప్రక్రియ ఇక వేగవంతం కానుందని తెలుస్తోంది. దేశ వ్యాప్తంగా కంటోన్మెంట్లలోని సివిలియన్ ప్రాంతాలను సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం కోసం లేఖలు రాసింది. తెలంగాణ ప్రభుత్వంతో సైతం ఆగస్టులో అందుకు సంబంధించిన కమిటీ భేటీ అయింది. అనంతరం ఈ విషయంపై ఉన్నత స్థాయిలో సంప్రదింపులు కొనసాగుతూ వచ్చాయి. ఇదిలా ఉండగా, కంటోన్మెంట్ జీహెచ్‌ఎంసీలో అంతర్భాగంగా ఉన్నప్పటికీ ఆర్మీ ఆంక్షల వల్ల స్థానికులకు మెరుగైన పౌరసేవలు, సదుపాయాలు దక్కడం లేదనే ఆందోళన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే కంటోన్మెంట్‌ను జిహెచంఎంసిలో కలపాల్సిందిగా కొన్నేండ్లుగా డిమాండ్ వినిపిస్తోంది. ఈ క్రమంలో ఆర్మీ ఉన్నతాధికారులు సైతం కంటోన్మెంట్లకు ప్రతియేటా సర్వీసు చార్జీలు చెల్లించాల్సి రావడం తమకు ఆర్థిక భారంగా మారిందని భావిస్తూ.. సివిలియన్ ప్రాంతాలను వేరు చేయాల్సిందిగా ఐదేండ్ల కిందటే మంత్రిత్వ శాఖను కోరారు. ఈ ప్రతిపాదనకు అనుగుణంగా ఏర్పాటైన సుమిత్ బోస్ కమిటీ తన ప్రతిపాదనల్లో.. ఆ ప్రాంతాల విలీనంతోపాటు 2006 నాటి కంటోన్మెంట్ చట్టంలో మార్పులు చేస్తూ 2020లో నూతన బిల్లును రూపొందించారు.

24, 25 తేదీల్లో హైదరాబాద్‌లో వజ్రోత్సవ వేడుకలు

- విద్యారంగ సేవకు ఉపాధ్యాయులు పునరంకితం కావాలి
- ఎస్‌టియుటిఎస్ అధ్యక్షులు సదానందంగౌడ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియుటిఎస్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టియుటిఎస్) వజ్రోత్సవ వేడుకలను ఈనెల 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్న ఎంఈ రెడ్డి గార్డెన్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం పర్వత్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు చెప్పారు. ఈ వేడుకలతో విద్యారంగ సేవకు ఉపాధ్యాయులు పునరంకితవ్వాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సమరోత్సాహంతో పనిచేయాలని కోరారు. హైదరాబాద్‌లోని ఎస్‌టియుటిఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ వేడుకలకు మంత్రులు టి హరీశ్ రావు, పి సబితాఇంద్రారెడ్డి, వి శ్రీనివాస్‌గౌడ్. ఎ ఇంద్రకరణ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, ఎస్‌టియుఎపి ఎమ్మెల్సీ కత్తి నరసింహరెడ్డి, ఎమ్మెల్యే డి సుధీర్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. ఈ వజ్రోత్సవాల్లో ఉపాధ్యాయ సమస్యలు, ఇప్పటి వరకు సాధించిన విజయాలు, సాధించాల్సిన హక్కులు తదితర అంశాలపై చర్చిస్తామని చెప్పారు. ఈ వేడుకలు సమస్యలకు పరిష్కారం చూపుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బదిలీలు, పదోన్నతులపైన ప్రభుత్వ నిర్ణయం వెలువడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎస్టీయూ 1946లో ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఆ రకంగా తమ సంఘం స్వాతంత్ర్యం రాకముందు నుంచే 1947, జూన్ 9 నుంచి అధికారిక సంఘంగా కొనసాగుతుందన్నారు. గతంలో ఎస్టీయూటీఎస్ కార్యక్రమాలకు రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌తోపాటు పలువురు ముఖ్యమంత్రులు హాజరయ్యారని వివరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర నాయకులు కరుణాకర్‌రెడ్డి, టి పోల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే జియోట్యాగింగ్

కమీషన్ల కోసమే ఉపాధ్యాయులకు జియోట్యాగింగ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎస్‌టియుటిఎస్ అధ్యక్షులు సదానందంగౌడ్ విమర్శించారు. 17 జిల్లాల్లో బయోమెట్రిక్ అమలవుతున్నదని చెప్పారు. ఓ ప్రయివేటు సంస్థ జియోట్యాగింగ్‌ను రూపొందిస్తే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని ఉపాధ్యాయులకు అమలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయాలు తగదని హెచ్చరించారు. అన్ని శాఖల్లోని ఉద్యోగులకూ ఈ విధానాన్ని వర్తింపచేస్తే తమకు అభ్యంతరం లేదనీ, కేవలం ఉపాధ్యాయులపైనే కక్షసాధింపు చర్యలు ఎందుకని ప్రభుత్వాన్ని అడిగారు. జియోట్యాగింగ్ మంచిదేనంటూ సిట్టింగ్ ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి చెప్పడం సరైంది కాదని ఎస్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు విమర్శించారు.